క్లుప్తంగా

అడ్డంగా స్టాపర్లు



నేవల్ క్వార్టర్స్‌కు ఎదురుగా గల సేవా మార్గంపై అడ్డంగా ఉన్న స్టాపర్

మల్కాపురం: ట్రాఫిక్ నియంత్రణ కోసం ఉంచాల్సిన స్టాపర్లు మల్కాపురం నుంచి నేవల్ క్వార్టర్స్‌కు వెళ్లే మార్గంలో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. నేవల్ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న సేవా మార్గంపై వీటిని అడ్డంగా పెట్టడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య లేనప్పటికీ, మార్గానికి అడ్డంగా పెట్టిన స్టాపర్లను గుర్తించలేక చాలామంది వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ ప్రమాదకరమైన స్టాపర్లను తక్షణమే తొలగించాలని, దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వీల్‌చైర్ల అందజేత



దివ్యాంగులకు వీల్ చైర్లు అందిస్తున్న గణబాబు

గోపాలపట్నం: పశ్చిమ నియోజకవర్గంలోని పలువురి దివ్యాంగులకు ప్రభుత్వ విప్ గణబాబు వీల్‌చైర్లను మంగళవారం గోపాలపట్నంలోని ఆయన క్యాంప్ కార్యాలయం వద్ద అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీల్ చైర్లు హెచ్‌పీసీఎల్ సహకారంతో అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ హెచ్‌ఆర్ కిరణ్, కాళి, కవిత తదితరులు పాల్గొన్నారు.

పూడికల తొలగింపు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని వీధి కాలువల్లో పూడికలను వార్డు శానిటరీ సిబ్బంది మంగళవారం తొలగించారు.పల్లివీధి,గొల్లవీధి తదితర ప్రాంతాల్లో కాలువల్లో పూడికలు పేరుకుపోయి దోమలు వ్యాప్తి చెందాయి. దీనిపై స్పందించిన వార్డు శానిటరీ సిబ్బంది కాలువల్లో వ్యర్థాలు తొలగించారు.

డీజిల్ లోకో షెడ్‌లో తనిఖీలు



డీజిల్ లోకో షెడ్‌లో పర్యటిస్తున్న డీఆర్‌ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్, డివిజినల్ రైల్వే మేనేజర్ లలిత్‌బోహ్రా మంగళవారం డీజిల్ లోకో షెడ్‌లో పర్యటించారు. గత ఆరు నెలల్లో లోకో షెడ్ పనితీరు, సామర్థ్యం, జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించారు. సరకు రవాణా, లోడింగ్ సామర్థ్యం పెంపుదల వంటి కీలక విషయాలపై సమీక్షించారు. ఈ పర్యటనలో సీనియర్ డివిజినల్ మెకానికల్ ఇంజినీర్ (డీజిల్) ఎంకే సాహూ, సీనియర్ డివిజినల్ ఫైనాన్స్ మేనేజర్ ఎం.హరనాథ్, సూపర్‌వైజరు పాల్గొన్నారు.

లలితాపీఠంలో 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సీతంపేట: స్థానిక అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ వరకు దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం పీఠం దర్బారు హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో ఈ నెల 22న ఉదయం 8:30 గంటలకు అమ్మవారి సన్నిధిలో కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభిస్తామని తెలిపారు. లక్ష్మీ గణపతి హోమం, చండీ హోమం నిర్వహిస్తామన్నారు. 23న శ్రీసుబ్రహ్మణ్యస్వామి, సర్పసూక్త హోమం, మన్యు పాశుపత హోమం, 24న శ్రీప్రత్యంగిర భద్రకాళి హోమం, 25న దత్తాత్రేయ దక్షిణామూర్తి హోమం, 26న లలితాదేవి హోమం, మహాలక్ష్మి షడక్షరి, ఖడ్గమాల హోమం, 27న వారాహిదేవి హోమం, రాజశ్యామల హోమం, 28న మహా సౌర అరుణహోమం, 29న సరస్వతి దేవి, గాయత్రి దేవి హోమం, 30న కాళీహోమం, బగళాముఖి హోమం, అక్టోబరు 1న ఉదయం 10 గంటలకు వనదుర్గా, శ్రీవిద్యా హోమం, 2న దశమి రోజున 108 ద్రవ్యాలతో మహా పూర్ణాహుతి, చండీహోమం, లఘు పూర్ణాహుతి నిర్వహిస్తామని తెలిపారు. రోజూ ఉదయం చండీ పారాయణ, సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తామని తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆశయం పచ్చని ప్రయాణం

సింధియా: పర్యావరణ పరిరక్షణ అంటే అది ఎవరో చేసే పని అనుకుంటాం. కానీ ఎవరికి తోచిన సాయం వారు చేస్తే ఎంత పెద్ద మార్పు అయినా సాధ్యమేనని నిరూపిస్తున్నాడు ఓ ఆటో డ్రైవర్. తన ఆటోనే ఒక తోటగా మార్చి, దానిపైనే ప్రచారం చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇతని పేరు డేవిడ్. విశాఖలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన డేవిడ్ ఐదేళ్లుగా తన పర్యావరణ ప్రేమను వినూత్నంగా చాటుకుంటున్నాడు.



పర్యావరణంపై అపారమైన ప్రేమ

చిన్నప్పటి నుంచే మొక్కల పెంపకంపై ఆసక్తి ఉన్న డేవిడ్, తన ఆటోలో వేసవి కాలంలో మూడు నెలల పాటు నగరాలు, గ్రామాల్లో తిరుగుతూ ప్రజలకు పర్యావరణంపై అవగాహన కల్పిస్తాడు. స్కూల్ పిల్లలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేసి,



మొక్కలకు నీళ్లుపోస్తున్న ఆటో డ్రైవర్ డేవిడ్

ఆటోలో పెంచుతున్న మొక్కలు

వాటిని ఎలా సంరక్షించుకోవాలో కూడా నేర్పిస్తున్నాడు. అంతేకాకుండా కాలుష్యంతో నిండిన పారిశ్రామిక ప్రాంతాల్లో కూడా మొక్కలు నాటుతూ తన గొప్ప మనసు చాటుకుంటున్నాడు.

రహదారి భద్రతకు కూడా తోడ్పాటు

పర్యావరణ ప్రేమికుడే కాదు, రోడ్డు భద్రతకు కూడా డేవిడ్ తన వంతుగా సాయం చేస్తున్నాడు. తన ఆటోలో మట్టిని తీసుకెళ్లి, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాలను నివారించడానికి కృషి చేస్తున్నాడు. ఈ పనుల వల్ల డేవిడ్‌కు ప్రజల నుంచి ప్రశంసలు దక్కుతున్నాయి. 'నా వల్ల ఏమవుతుందిలే' అని నిరాశ పడకుండా, తనకు తోచిన విధంగా పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న డేవిడ్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఆటో.. ఓ పచ్చని వనం

సాధారణంగా మొక్కలు పెరట్లోనో, మేడపైనో పెంచుతాం. కానీ డేవిడ్ దీనికి భిన్నంగా తన ఆటో ఇరువైపులా, వెనుక మట్టి కుండీలను అమర్చి వాటిలో మొక్కలను పెంచుతున్నాడు. చూసేవాళ్లకు అది ఒక చిన్నపాటి తోటలా కనిపిస్తుంది. కేవలం మొక్కలు పెంచడమే కాకుండా, తన ఆటోలో ప్రయాణించే వారికి, తను వెళ్లే ప్రతిచోటా మొక్కల ఆవశ్యకతను, పర్యావరణ పరిరక్షణ గురించి వివరిస్తాడు.



పచ్చని మొక్కలతో అలంకరించిన డేవిడ్ ఆటో

ఎందరికో స్ఫూర్తి



డేవిడ్ ఆటోలో ఎప్పుడు ప్రయాణించిన మంచి అనుభూతి కలుగుతుంది. పచ్చని మొక్కల మధ్య ప్రయాణం చాలా బాగుంటుంది. స్వచ్ఛమైన గాలితో పాటు తాగడానికి నీరును కూడా ఏర్పాటు చేయడం గొప్ప విషయం. మొక్కలు పెంచాలి, పర్యావరణాన్ని కాపాడాలి అని ఆటో ఎక్కిన ప్రతీసారి చెబుతుంటాడు. డేవిడ్ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. **శ్వేత, ప్రయాణికురాలు**

సెయింట్ జోసెఫ్‌లో హిందీ దివస్



విద్యార్థిని సత్కరిస్తున్న హిందీ అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ విభాగాధిపతి డాక్టర్ పి.కె.జయలక్ష్మి నేతృత్వంలో మంగళవారం హిందీ వారోత్సవాలు నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ షైజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ మహేశ్వరరావు మాట్లాడుతూ రాజ్యభాష హిందీ ప్రాముఖ్యతను తెలిపారు. హిందీ సాహిత్య భారతి, విశాఖ యూనిట్ నెహ్రూ యువకేంద్రం, భారత ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వాద వివాదం, వ్యాస రచన, కవితా పఠనం, ప్రశ్నోత్తర పోటీలు, సాహిత్య, సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. అనంతరం హిందీ పత్రిక 19వ సంచికను అతిథులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. దీప్తి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ డాక్టర్ రవికుమార్

గోపాలపట్నం: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు చేపట్టిన వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ కోరారు. గోపాలపట్నం పశువుల ఆస్పత్రిలో వేస్తున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గాలికుంటు వ్యాధి సోకే పశువుకు తీవ్రమైన జ్వరం నీరం, నోటి నుంచి తీగల్లా వచ్చే చొంగ, నోరు, గిట్టల్లో పుండ్లు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. పాల ఉత్పత్తి తగ్గడం, వ్యాధి సోకిన పశువు పాలు తాగితే దూడలు నష్టపోవాల్సి వస్తుందన్నారు.టీకాలు వేయడం వల్ల పాడిపశువుల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని...మరణాలు నివారిస్తుందని వివరించారు. ప్రతీ గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న కోరమాండల్ అధికారులు

మల్కాపురం : ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ 58వ వార్డులోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ, పర్యావరణం అండ్ సీఎస్‌ఆర్ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. కార్యక్రమాన్ని కోరమాండల్ సీనియర్ మేనేజర్ నాగార్జున, హెచ్‌ఆర్ (సీఎస్‌ఆర్) ఎస్.వెంకటరమణ, డిప్యూటీ మేనేజర్ జి.నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాల కోసం వాతావరణాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఓజోన్ అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.

కొనసాగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ విభాగం వద్ద ఆందోళన చేస్తున్న కార్మిక నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి తొలగించిన కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత, కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు చేస్తున్న ఆందోళన ఆరో రోజూ కొనసాగింది. ఈ అంశంపై మంగళవారం చేపట్టిన ఆందోళనలో భాగంగా జనరల్ షిఫ్ట్ విధులకు వెళ్లిన ఉద్యోగులను అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచి పోయింది. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టారు. అనంతరం కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు ట్రైనింగ్ విభాగం వద్ద ఆందోళన చేశారు. నిర్వాసిత కార్మికులను తిరిగి చేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ చెప్పినా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులను చేర్చుకునే వరకు తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నమ్మి రమణ, భాస్కరరావు, ఉమ్మిడి అప్పారావు, మంత్రి రవి, వంశీకృష్ణ, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టులో నేడు 'యాత్రి సేవా దివాస్'



మాట్లాడుతున్న ఇన్‌చార్జి డైరెక్టర్ పురుషోత్తం

గోపాలపట్నం: విమానాశ్రయంలో బుధవారం 'యాత్రి సేవా దివాస్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎయిర్‌పోర్టు ఇన్‌చార్జ్ డైరెక్టర్ ఎస్. పురుషోత్తం తెలిపారు. ఇందులో భాగంగా క్విజ్, చిత్రలేఖనం పోటీలు, ఫోక్ డ్యాన్స్ ప్రదర్శనలు ఉంటాయి. 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని, టాక్సీ డ్రైవర్ల కోసం ఉచిత నేత్ర శిబిరం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు సెల్ఫీ బూత్‌లు, ఫీడ్‌బ్యాక్ సెషన్‌లు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాలు ఉదయం 6:45 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగుతాయి.

అధికారులు కదిలారు



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..



శాంతినగర్ సచివాలయం వద్ద నిల్వనీటిని తొలగించి దోమల మందు చల్లుతున్న సిబ్బంది

గోపాలపట్నం: మలేరియా విభాగం అధికారులు కదిలారు. దోమల వృద్ధికి నిలయమైన ప్రాంతాల్లో పిచికారీ చేశారు. జీవీఎంసీ 52వ వార్డు శాంతినగర్‌లోని సచివాలయ భవనం శ్లాబ్‌పై, ఎన్‌ఏడీ జంక్షన్ ఫ్లైఓవర్ సెంటర్ సర్కిల్ ఫౌంటైన్‌లో వర్షపు నీరు నిలిచి దోమలార్వాలు పెరగడంతో మంగళవారం సాక్షి దినపత్రికలో ఆ ప్రాంగణాలు.. దోమల వృద్ధి కేంద్రాలు అన్న శీర్షికతో ప్రచురితమైన వార్తకు మలేరియా విభాగం అధికారులు స్పందించారు. ఆయా ప్రాంతాల్లో దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేశారు. ఇది చూసిన స్థానికులు అన్ని ప్రాంతాల్లో ఫాగింగ్, దోమల మందు పిచికారీ చేయాలని కోరుతున్నారు.

పోతిన సేవలు చిరస్మరణీయం



పోతిన సన్యాసిరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మల్కాపురం: మాజీ ఎమ్మెల్యే, దివంగత సీపీఐ నేత పోతిన సన్యాసిరావు సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి కె.రహమాన్ అన్నారు. మల్కాపురం శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం సన్యాసిరావు 41వ వర్థంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సన్యాసిరావు ఎమ్మెల్యేగా బడుగు, బలహీనవర్గాల ప్రజల అభివృద్ధి కోసం కృషి చేశారని కొనియాడారు. ప్రస్తుత ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలు చెప్పడం తప్పా ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుడాల రాంబాబు, కనకరాజు, రామకృష్ణ, కామేశ్వరరావు, ఎన్వీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు



నిర్మాణాన్ని తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీలో శ్రీ శాంతినికేతన్ స్కూల్‌పై నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అదనపు అంతస్తు స్లాబ్‌ను జీవీఎంసీ అధికారులు మంగళవారం తొలగించారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తప్పవని, ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే స్థానికులు సమాచారం అందించాలని కోరారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దండి



కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ గణబాబు

మల్కాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని ప్రభుత్వ విప్ పి.గణబాబు ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. తమ వంతు బాధ్యతగా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని, వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో మెరుగైన ర్యాంకులు సాధించేలా ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాలని ఆయన ఉపాధ్యాయులను కోరారు. దీనిలో భాగంగా శ్రీహరిపురం, మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించి, తరగతి గదులు, ఇతర వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో విడివిడిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రియదర్శిని, రమాకుమారి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అదానీ సంస్థకు భూకేటాయింపులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: పెదగంట్యాడలో అదానీ గంగవరం గ్రేడింగ్ సిమెంట్ యూనిట్‌కు భూకేటాయింపులు, అనుమతులు రద్దు చేయాలని, జనావాసాలకు దూరంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కేఎస్‌వీ కుమార్, వి.కృష్ణారావుతో కలిసి సిటు జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లా పెదగంట్యాడ మండలం సర్వే నంబరు 97(పి), 98(పి), 99(పి), 101(పి)లో సుమారు 20 ఎకరాల భూమిని అదానీ అంబుజా సిమెంట్స్‌కు గంగవరం సిమెంట్ గ్రేడింగ్ యూనిట్ ఏర్పాటుకు కట్టబెట్టడానికి కూటమి ప్రభుత్వం సిద్ధపడుతోందన్నారు. అందుకు సంబంధించి వచ్చే నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రకటన విడుదల చేసిందన్నారు. సాగరతీరం, స్టీల్‌ప్లాంట్, జనావాసాలకు మధ్య ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల పెదగంట్యాడ, గాజువాక, గంగవరం, మల్కాపురం పరిసర ప్రాంతాల్లో నివాసముంటున్న సుమారు 12 లక్షల మంది ప్రజల ఆరోగ్యాలకు, జీవరాశులకు హానీ జరుగుతుందని చెప్పారు. ఈ పరిశ్రమ వల్ల గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, శబ్ద కాలుష్యం పెరుగుతుందన్నారు. భారీ వాహన రాకపోకలు పెరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రాణనష్టం అధికమవుతుందని చెప్పారు. కేవలం 60 పర్మినెంట్, 200 మందికి కాంట్రాక్ట్ ఉపాధి మాత్రమే లభిస్తుందని, అది కూడా స్థానికులకు ఇస్తారన్న గ్యారంటీ లేదన్నారు.

అదనపు బస్సుల పెంపునకు చర్యలు చేపట్టాలి

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లాలో ప్రయాణికులకు తగ్గట్టుగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచి, ప్రజల కష్టాలు తీర్చాలని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు డిమాండ్ చేశారు. నగరంలోని జగదాంబ జంక్షన్ సమీపాన ఉన్న సీపీఎం కార్యాలయంలో మంగళవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.కృష్ణారావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందని, దీనిని సీపీఎం స్వాగతిస్తోందన్నారు. అయితే ప్రస్తుత బస్సులతోనే ఈ పథకం అమలు చేయడం వల్ల ప్రయాణికులు, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, వికలాంగులు, పిల్లలు, విద్యార్థులు, పురుషులు తీవ్ర ఇబ్బందులు పడతున్నారన్నారు. గంటల తరబడి నిలబడి ప్రయాణించాల్సి వస్తుందని, ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో బస్సుల్లో నిల్చోవడానికి కూడా ఖాళీ లేని పరిస్థితి, బస్సుల డోర్ల వద్ద విద్యార్థులు, యువత పిట్టల్లా వేలాడుతూ, ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొందన్నారు. బస్సులు ఆపకపోతే ప్రయాణికులు డ్రైవర్లపై దాడులు చేస్తున్నారని, దుర్భాషలాడుతున్నారని, లోడ్ ఎక్కువగా ఉండడం వల్ల ఇటీవల ఓ బస్సు దగ్ధమైందన్నారు. బస్సుల్లో ఘర్షణలు కూడా చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 630 బస్సులు మాత్రమే నడుస్తున్నాయని, నిపుణుల అంచనా ప్రకారం పెద్ద నగరాల్లో ప్రతి లక్ష జనాభాకు కనీసం 60 బస్సులుండాలని, ఆ విధంగా మహా విశాఖ నగరానికి కనీసం 1500 బస్సులుండాలని తెలిపారు. జిల్లా మొత్తం కనీసం 2100 బస్సులుండాలని, కానీ 630 మాత్రమే ఉన్నాయన్నారు. బస్సుల సంఖ్య పెంచి రద్దీని నియంత్రించాల్సిన ప్రభుత్వం ప్రయాణికుల సమయాలు మార్చుకోవాలని ఆర్టీసీ ప్రాంతీయ మేనేజర్ ద్వారా ప్రకటన చేయించిందన్నారు. ఇది అత్యంత బాధ్యతా రాహిత్య ప్రకటన అని, ప్రజలు తమ అవసర సమయాల్లో ప్రయాణాలు చేస్తారని, బస్సుల రద్దీ సమయాలను బట్టి చేయాలనడం సరి కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెంటనే జోక్యం చేసుకుని విశాఖ జిల్లా ప్రజల ప్రయాణ అవసరాలకు తగ్గట్టు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అలసత్వం తగదు



జోనల్ కమిషనర్లు, అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

దాబాగార్డెన్స్: పారిశుద్ధ్య పనుల నిర్వహణలో అలసత్వం వహించరాదని, నిర్ణీత సమయానికే అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరు కావాలని, వార్డు శానిటేషన్ కార్యదర్శులు అప్రమత్తతతో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా మంగళవారం జోన్-3, జోన్-5లోని పలు వార్డులు, నరసింహనగర్ రైతు బజార్ ప్రాంతాల్లో పర్యటించారు. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్కడా వ్యర్థాలు లేకుండా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులు, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శుల హాజరును పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులు సచివాలయం పరిధిలో ఎక్కడెక్కడ విధులు నిర్వహిస్తున్నారో శానిటరీ కార్యదర్శులకు అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకు సచివాలయం డిప్లాయ్‌మెంట్ ప్లాన్, క్లాప్ వాహనాల రూట్ మ్యాప్, యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. దీర్ఘ కాలంగా విధులకు దూరంగా ఉన్న పారిశుద్ధ్య కార్మికుల వివరాల జాబితా సిద్ధం చేసి, అందుకు ప్రత్యామ్నాయంగా తదుపరి చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్లు కె.శివప్రసాద్, బి.రాముకు ఆదేశించారు. నరసింహనగర్ రైతు బజార్ వద్ద జనసంచారం అధికంగా ఉన్నందున అదే స్థాయిలో పరిసర ప్రాంతాల్లో కూడా వ్యర్థాలు ఎక్కువగా ఉంటాయని, ఉదయం, సాయంత్రం రెండు పూటలా వ్యర్థాలు తరలించేలా నిత్యం చర్యలు చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. క్లాప్ వాహనాల నిర్వహణ కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ వాహనాల రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా, డ్రైవర్లు సమయానికి వ్యర్థాలు సేకరించేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పర్యటనలో శానిటరీ సూపర్‌వైజర్ జనార్దన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్రాంతి, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వీవోఏల పట్ల ప్రభుత్వ వివక్ష తగదు

ఎంవీపీ కాలనీ: విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వీవోఏలు నిరసనకు దిగారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎంవీపీ కాలనీలోని డీఆర్‌డీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ వీవోఏల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్షపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. 3 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌తో ఉద్యోగులను వేధిస్తోందన్నారు. వేతనాల పెంపు కోసం పెద్ద ఎత్తున విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. పైగా కొత్త సెల్‌ఫోన్లు అందించకుండా పాత వాటితోనే 26 రకాల యాప్ వర్కులు చేయాలని ఒత్తిడికి గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా వీవోఏల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలన్నారు. వేతనాలు పెంచడంతోపాటు కొత్త ఫోన్లు అందించాలని, ఆర్పీలు మాదిరిగానే 3 ఏళ్ల కాల పరిమితి జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24న జరిగే రాష్ట్ర స్థాయి సమావేశంలోపు సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు అపర్ణ హెచ్చరించారు. అనంతరం డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతికి సమస్యల పరిష్కారంపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మణి, కంచమ్మ, శ్రీలక్ష్మి, పార్వతి, శారద, శ్యామల, వెంకటలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.